క్లుప్తంగా

రజక చెరువుల్లో పూడిక తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న రజక వృత్తిదారుల చెరువులను ఉపాధి హామీ పథకంలో పూడికలు తీయించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంఘస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారుల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో అనేక రజక వృత్తిదారుల చెరువులు పూడికలతో నిండిపోయాయని, మరి కొన్ని ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. తక్షణమే ఎన్ఆర్‌జీఎస్ పథకంలో చెరువుల పూడికలను తొలగించి రజకులను ఆదుకోవాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం రజకులను ఆదుకోవాలని కోరారు. వీరి వృత్తి చెరువుకు సంబంధించి జూన్,30తో లీజు గడువు ముగుస్తుందన్నారు. వీరికి వచ్చే మూడేళ్లకు సంబంధించి లీజు నిర్ణయించేటప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు విధించాలని కోరారు. ఈ సందర్భంగా కానూరు అగ్రహారం రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గన్నవరపు వెంకన్న, ఉపాధ్యక్షుడిగా జి.రాంబాబు, కార్యదర్శిగా కె.సాంబయ్య, నలుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీకి జిల్లా నాయకులు అభినందనలు తెలియజేసారు

20న సాయి మందిర్ ద్వితీయ వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మోతేవారి తోటలోని శ్రీ సాయి మందిర్‌లో ఈ నెల 20న ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు సాయి మందిర్ కమిటీ ప్రతినిధి పెదపాటి రామకృష్ణ తెలిపారు. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు అభిషేకాలు, హోమం, 9 గంటలకు ఎస్‌పీఎస్ వాసు మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో సాయి సంకీర్తనల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటలకు మానవత విద్యానిధి సంస్థ ఆధ్వర్యంలో చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ద్వారా విద్యారంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 7.30 గంటలకు సాయి సత్సంగం, 8.30 గంటలకు సాయి భజన ఉంటుందన్నారు.

పోలీస్ తనిఖీలు ముమ్మరం

- ఏలూరు కొత్తపేటలో కార్డెన్ సెర్చ్
- సమస్యాత్మక ప్రాంతాల్లో జల్లెడ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు టూటౌన్ కొత్తపేట ప్రాంతంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఏలూరు టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్సైలు సాధిక్, మధీనా బాషా, రవితేజ, సాయుధ బలగాలతో కలిసి పోలీస్ సిబ్బంది ప్రతి ఇంటినీ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, ఇంటిలో ఏవైనా మారణాయుధాలు ఉన్నాయా అనే కోణంలోనూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఏలూరు నగరంలో టూటౌన్ ప్రాంతంలో కొన్ని చోట్ల పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ ప్రతి వ్యక్తిపై నిఘా ఉంచారు.

పటిష్టమైన భద్రతా చర్యలు

ఏలూరు కొత్తపేట, 12పంపుల సెంటర్, గన్‌బజార్ వైపు వెళ్లే ప్రధాన రహదారి వెంట పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపట్టారు. అసాంఘిక శక్తులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే అవకాశం ఉందనే సమాచారంతో పోలీస్ అధికారులు ముందుస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యాత్మక ప్రాంతం కొత్తపేట ప్రాంతంలో పోలీస్ పికెట్ సైతం ఏర్పాటు చేశామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు, గొడవలకు, దాడులకు దిగితే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా వ్యక్తులు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలని, మీ వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ ప్రభాకర్ స్పష్టం చేశారు. సమాచారాన్ని 112కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

ఏలూరు వన్‌టౌన్ వడ్డెరగూడెంలో..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయనే సమాచారంతో పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ప్రాంతంలోని వడ్డెరగూడెంలో శుక్రవారం రాత్రి కార్డెన్ సెర్చ్ చేశారు. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ ఎస్సైలు ఎన్.లక్ష్మణబాబు, నవీన్ కుమార్, ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి, సాయుధ బలగాలతో ఆకస్మికంగా వడ్డెరగూడెంలో ప్రతి ఇంటినీ పోలీసులు జల్లెడ పట్టారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలు స్వేచ్ఛకు భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గొడవలు, వివాదాలకు దారి తీసేలా వ్యవహరిస్తే చట్టం మేరకు చర్యలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 112కు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. యువత, విద్యార్థులు అనవసరమైన వివాదాల్లోకి వెళితే భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడతాయని ఆయన తెలిపారు.



ఏలూరు కొత్తపేట ప్రాంతంలో ఇళ్ల వద్ద సమాచారం సేకరిస్తున్న టూటౌన్ ఎస్సై మదీనా బాషా



ఏలూరు కొత్తపేట ప్రాంతంలో కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో సాయుధ బలగాలతో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్



ఏలూరు కొత్తపేట ప్రాంతంలో పోలీస్ సిబ్బంది, సాయుధ బలగాలతో ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్



ఏలూరు వడ్డెరగూడెంలో కార్డెన్ సెర్చ్‌లో ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణబాబు

కలెక్టర్‌కు అభినందన



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను సత్కరిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ నాయకులు

ఏలూరు(మెట్రో): ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సమర్థవంతంగా పనిచేశారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు అన్నారు. శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కనిచ్చి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైందన్నారు. స్వీప్ ద్వారా ఓటరుని చైతన్యం చేసి పోలింగ్ బూత్ వరకు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చక్కగా చేశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది చాలా బాగా పని చేశారని, రాత్రి అయ్యేవరకు పోలింగ్ జరిగినా ఉద్యోగులు కష్టపడి పనిచేశారని అభినందించారు. త్వరలోనే వారిని సత్కరిస్తామన్నారు. ఎన్నికల్లో విధుల్లో పాల్గొన్న మెడికల్ సిబ్బందికి కూడా రెమ్యునరేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తాలూకా అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా ఎన్జీవోస్ నాయకులు నోరి శ్రీనివాస్, నారాయణ నాయుడు, నరేంద్ర, పూడి శ్రీనివాస్, గంగాధర్, హరినారాయణ, మహిళా విభాగం సభ్యులు సత్యభారతి, మల్లిక, నాగమణి, జగదీశ్వరి, క్లాస్-4 సంఘం నాయకులు వై.శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఉపాధికి గండి

- ఏలూరు సీఆర్ఆర్ అటానమస్ కళాశాల వద్ద ఆక్రమణల తొలగింపు
- గగ్గోలు పెడుతున్న వ్యాపారులు

ఏలూరు టౌన్ : ఏలూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అత్యుత్సాహం కారణంగా చిరు వ్యాపారుల ఉపాధికి గండి పడింది. ఏలూరు నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమించి బడాబాబులు వ్యాపారాలు చేస్తున్నా వాటివైపు కన్నెత్తిచూడని నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు చిరు వ్యాపారులపై తమ ప్రతాపాన్ని చూపించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు ప్రధాన ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు సైతం చేస్తున్నా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు పుట్‌పాత్ పక్కన చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న వారి దుకాణాలు తొలగించారు. ఏలూరు కొత్త బస్టాండ్ దాటిన అనంతరం సీఆర్ఆర్ అటానమస్ కాలేజీ ముందు ప్రధాన రహదారి పుట్‌పాత్ పక్కగా గత కొంత కాలంగా చిరు వ్యాపారులు తాత్కాలికంగా దుకాణాలు పెట్టుకున్నారు. కూరగాయలు, మామిడిపండ్లు, పూల మొక్కలు ఇలా పదిమంది చిరు వ్యాపారాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆకస్మికంగా నగర టౌన్‌ప్లానింగ్ అధికారులు సిబ్బంది బుధవారం మధ్యాహ్నం ప్రొక్లెయినర్‌తో దుకాణాలను కూల్చివేశారు. ఇదేమిటని అడిగితే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, ఇక్కడ దుకాణాల ఏర్పాటుకు వీల్లేదంటూ చెప్పారు. దీంతో వారంతా లబోదిబోమంటూ ఉపాధి దెబ్బతీశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు సీఆర్ఆర్ కాలేజీ వద్ద పుట్‌పాత్ పక్కన ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు





పుట్‌పాత్ పక్కన పుచ్చకాయల దుకాణాన్ని కూల్చివేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ఆకస్మికంగా తొలగించారు



“ చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చాలాకాలంగా ఇదే ప్రాంతంలో దుకాణాన్ని నిర్వహిస్తున్నాం. ఆకస్మికంగా నగరపాలక సంస్థ అధికారులు వచ్చి ప్రొక్లెయినర్‌తో దుకాణాన్ని తొలగించారు. కనీసం తమకు కొంత సమయం ఇచ్చి ఉంటే వేరే చోటుకు దుకాణం తరలించేవాళ్లం.

– నారిశెట్టి ఆదిబాబు, చిరువ్యాపారి

ఆధారం కోల్పోయాం



చిన్నపాటి దుకాణం పెట్టుకుని ఉపాధి పొందుతున్నాం. ఎవరికీ అడ్డులేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నాం. మా దగ్గరకు వచ్చే వారు రోడ్డుపై వాహనాలు నిలిపివేస్తున్నారని, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనే కారణంగా దుకాణం తీసేశారు. ఏలూరులో అనేక చోట్ల రోడ్లపై దుకాణాలున్నా అధికారులెవరూ పట్టించుకోలేదు.

– ఎస్.వెంకటరమణ, చిరువ్యాపారి

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	02
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	15
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	06

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	04
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	34
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

చోరీ కేసులో 6 నెలలు జైలు

ఏలూరు (టూటౌన్): చోరీ కేసులో నేరం రుజువు కావడంతో కొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన పటాన్ రోజా ఖాన్(25)కు 6 నెలలు జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏలూరు నాలుగో అదనపు సివిల్ కం స్పెషల్ జ్యూడిషియల్, ఫోర్త్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు జడ్జి కె.స్పందన శుక్రవారం తీర్పు వెలువరించారు. 2022, అక్టోబరు 10న ఇందిరమ్మ కాలనీ టిడ్కో హౌస్ దగ్గర గదిలో భద్రపరిచిన బోరుకు సంబంధించిన వస్తువులు చోరీకి గురయ్యాయి. దీనిపై అప్పటి ఎస్ఐ రోజా ఖాన్‌ను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు.

26న శతాధిక పద్య కవుల సమ్మేళనం



శతాధిక పద్యకవుల సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 26న ఏలూరు నగరంలో శతాధిక పద్యకవుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరి కోటి తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో శుకృవారం శ్రీశ్రీ కళావేదిక జిల్లా కార్యవర్గ సమావేశం శ్రీహరి కోటి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే కాక దేశంలోని అనేక ప్రాంతాల్లో సాహిత్య, కళాప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏలూరు నగరంలో గొప్ప సాహిత్య కార్యక్రమంగా శతాధిక పద్య కవుల సమ్మేళనం నిర్వహించి ఈ కార్యక్రమానికి దేశంలోని అనేక మంది ప్రముఖ కవులను నగర ప్రజలకు పరిచయం చేసి వారి సాహితీ వైశిష్ట్యాన్ని పంచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి నగరంలోని సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు విశేషంగా సహకరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా శతాధిక పద్యకవుల సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు టీ. పార్థసారధి, ఉపాధ్యక్షుడు కొంతియాల కస్తూరి రావు, మహిళా అధ్యక్షురాలు శ్యామల హరికోటి, కార్యదర్శులు ఎంజే సుజయకృష్ణ, గురు శర్మ, గోరింక ఐజక్, ఈడా నాగేశ్వర రావు, అనూరాధ పురం, వీవీఎస్ గౌతం పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	04, 06
బెండకాయలు	44	కంద	64
పచ్చిమిర్చి	84	బీట్‌రూట్	36
కాకర కాయలు	36	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	200
బీరకాయలు (పందిరి)	58	అల్లం	160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	38-48	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	27	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	40

రైతుల ఆర్థికాభివృద్ధికి సెరీకల్చర్ దోహదం



మల్బరీ తోటను పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వాణి

దెందులూరు: మెట్ట ప్రాంత రైతులు, మల్బరీ సాగును సద్వినియోగం చేసుకుని కేంద్ర ప్రభుత్వ రాయితీలను పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సెరీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వాణి అన్నారు. శుక్రవారం రామారావుగూడెంలో దెందులూరు టెక్నికల్ అసిస్టెంట్ పి.రత్తయ్యతో కలిసి మల్బరీ సాగు తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మల్బరీ సాగు ఎకరానికి రూ.3.14 లక్షలు మంజూరైందని, సెరీకల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.3.60 లక్షలు, వడ్డీకి రూ.41 వేలు, ప్లాంటేషన్‌కు రూ.27 వేలు, అదనంగా రూ.30 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. మెట్టప్రాంత రైతులు సెరీకల్చర్ ద్వారా రైతులు గణనీయంగా దిగుబడి, ఆర్థికాభివృద్ధి, సాధిస్తున్నారని అన్నారు.

రేపు రచయితల సంఘం వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పశ్చిమ గోదావరి జిల్లా రచయితల సంఘం 4వ వార్షికోత్సవం ఈ నెల19వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా వెంకటేశ్వర్లు, బీ.నాగాస్త ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ చరిత్రకారుడు కొప్పర్తి వెంకట రమణమూర్తి, విశిష్ట అతిథులుగా తెలుగుభాష ఉద్యమకారుడు జీవీ పూర్ణచందు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ కే. అబ్రహం, ప్రముఖ సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నాట్యాచారిణి పార్వతీ రామచంద్రన్ శిష్యుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ప్రజా గాయకుడు మంగరాజు ఆధ్వర్యంలో చైతన్య గీతాలాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం ప్రముఖ సినీ కవి రసరాజుకు నండూరి వెంకట సుబ్బారావు స్మారక సాహిత్య పురస్కారం, సామాజికవేత్త బీకేఎస్ఆర్ అయ్యంగార్‌కు తొలి చరిత్రకారుడు కావలి బొర్రయ్య స్మారక పురస్కారం అందజేస్తామన్నారు. వీరితో పాటు రంగస్థల, టీవీ, సినీ నటుడు పీ. విజయకుమార్‌కు బందా కనక లింగేశ్వరరావు స్మారక పురస్కారం, ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతి రామ్‌కుమార్‌కు చల్లపల్లి సీతాదేవి స్మారక సంగీత పురస్కారం ప్రదానం చేస్తామన్నారు.